క్లుప్తంగా

సీఎం సభను విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు

గుడివాడరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం గుడివాడంలో నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసిన మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని లింగవరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం బహిరంగ సభకు జిల్లావ్యాప్తంగా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటెత్తారన్నారు. సీఎం సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి ఇదే ఉత్సాహంతో వైఎస్సార్ సీపీ విజయానికి పాటుపడతామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా వీరేశలింగం జయంతి



గుడివాడ టౌన్: కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి వీరేశలింగం చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నూలు సాంబశివరావును కందుకూరి పురస్కారం 2024తో సత్కరించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజే ఆంజనేయులు, భారత్ వికాస సమితీ సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాదు, నరహరిశెట్టి ప్రసాదు, నల్లగంచు రాంబాబు, సత్యనారాయణ, వంశీ, రచయిత వసుధ బసవేశ్వరరావు, కోగంటి గాంధి, వీవీ రాఘవాచారి, బి. అనంద్ మోహన్‌బోస్ పాల్గొన్నారు.

జోరుగా హైవే విస్తరణ పనులు

మండవల్లి: విజయవాడ-భీమవరం నేషనల్ హైవే విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. మండవల్లిలో మంగళవారం విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ముమ్మరంగా చేశారు. ఈ పనులు పూర్తిస్థాయిలో పూర్తి కావడానికి సుమారు రెండేళ్లు పడుతుందని సూపర్‌వైజర్ నాగరాజు తెలిపారు. భీమవరం - విజయవాడ మధ్య గల పట్టణాలు, గ్రామాల్లో ఈ పనులు జరుగుతున్నాయి.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం విశేష అభిషేకాలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి పుట్టలో పాలుపోసి అభిషేకాలు చేయించుకున్నారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో 154 అభిషేకాలు జరిగినట్లు సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు.

అశ్వవాహనంపై గ్రామోత్సవం

స్థానిక సింగరాయపాలెం బావాజీమఠంలోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లికుమార్తెగా సోమవారం అలంకరించారు. మంగళవారం ఉత్సవ విగ్రహాలను అశ్వవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

పూరిల్లు దగ్ధం

తోట్లవల్లూరు: విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. గ్రామ శివారు కలాసుమాలపల్లిలో బోరుగడ్డ రాఘవులకు చెందిన పూరింటికి మంగళవారం విద్యుత్‌షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. వేసవి కావడంతో మంటలు ఇల్లంతా ఎగబాకాయి. ఇంటితోపాటు వంటసామగ్రి, దుస్తులు కాలిపోవటంతో బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. పామర్రు ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో స్థానిక సంతమార్కెట్ వద్ద మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ దాతలుగా అంబవరపు శ్రీను, ప్రవల్లిక కుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి, నాయకులు యానాల బసవయ్య, దేవరపల్లి శర్మ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఘనంగా ఏర్పాట్లు



మోటూరు సీతారాముల ఆలయ ముఖద్వారం



మోటూరు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

గుడివాడరూరల్: అపరభద్రాద్రిగా పేరుగాంచిన మోటూరు(గోదావురం)లో వేంచేసియున్న శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయశాఖ అధికారులు మంగళవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 21వ తేదీ బుధవారం ఉదయం 12.24 గంటలకు సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భద్రాచలం తర్వాత రెండో అపరభద్రాద్రిగా పేరుగాంచిన మోటూరు గ్రామంలో ప్రతి ఏడాది శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. జిల్లాతో పాటు పరిసర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కల్యాణ వేడుకలకు హాజరవుతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఉత్సవ కమిటీతో పాటు, దేవదాయశాఖ అధికారులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గుడివాడరూరల్ ఎస్ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి పర్వదినాన భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దేవస్థానం ఈఓ జి.నాగమౌనిక, ఉత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.



పామర్రు వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏకనామం నిర్వహిస్తున్న భక్తులు

నవమి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

పామర్రు: స్థానిక ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవాల అంకురార్పణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏకాహ మండప ఆరాధన, భక్త బృందం సభ్యుల చేత ఏకనామ కార్యక్రమం చేశారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, బి.ఫణికిషోర్, శర్మల ఆధ్వర్యంలో ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని భక్తి శ్రద్ధలతో పూజించారు. గురువారం వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎల్‌సత్యవతి తెలిపారు.

నవమి ప్రత్యేక పూజలు

జమీదగ్గుమిల్లి(పామర్రు): శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలోని సీతారాముల వారిని మంగళవారం పెండ్లికుమారునిగా అలంకరించి విశేషంగా పూజాధికాలను నిర్వహించారు. తొలుత ఆలయంలోని మూల వరులకు విశేషంగా అభిషేకాలను నిర్వహించి, నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో సీతారామచంద్రస్వామి ఉత్సవిగ్రహాలను పెండ్లికుమారులుగా అలంకరించారు. తదుపరి భక్తులు కాకర్ల రామస్వామి, విమలకుమారి దంపతుల ఆధ్వర్యంలో విశేషంగా పూజలను చేశారు. ఉత్సవమూర్తులకు నీరాజన మంత్రపుష్పాలను ఇచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కాకర్ల సీతారామాంజనేయదాసు, చంద్రవతి, శీతాల శ్రీనివాసరావు విజయఝాన్సీ, కాకర్ల పుష్పావతి, శీతాల ధనలక్ష్మి, రావూరి అచ్యుతరావు తదితర భక్తులు పాల్గొన్నారు.

రామాలయాలు ముస్తాబు

తోట్లవల్లూరు: శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని రామాలయాలు నవమి వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే రామాలయాలకు అందంగా రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించటంతోపాటు భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు.

ముమ్మరంగా ఎమ్మెల్యే కొడాలి నాని ప్రచారం



ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం ఆయన అనుచరులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక 19వ వార్డులో ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. స్థానిక సత్యనారాయణపురంలో కొడాలి నాని అభిమానులు ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. వీధివీధికి మహిళలు హారతులు పడుతూ కొడాలి నానికి ఆశీస్సులు ఇచ్చారు. ఓ మహిళ కొడాలి నానికి విజయం చేకూరాలని కోరుతూ తెచ్చిన రక్షాబంధన్‌ను ఆయన చేతికి కట్టారు. కొడాలి నానిని అభిమానులు, ఓటర్లు పలువురు తమ ఇంటికి పిలిచి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభలో ఇచ్చిన హామీలు, సభ విజయవంతం కావడంతో కార్యకర్తల్లో జోష్ నింపింది. పెద్ద సంఖ్యలో అభిమానులు ఎమ్మెల్యేకు జేజేలు పలుకుతూ ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశేష జనవాహిని మధ్య మేమంతా సిద్ధం సభను విజయవంతం చేసిన గుడివాడ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రతిఒక్కరికీ మేలు చేయాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి తన పాలన కొనసాగించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పనులు కళ్లకు కట్టినట్టుగా ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. చంద్రబాబునాయుడు పాలనలో కొన్ని వర్గాలకే పనులు చేసి, దోచుకునేందుకు అధికారాన్ని వినియోగించారని విమర్శించారు. చంద్రబాబునాయుడు జన్మభూమి కమిటీలను పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టడంతో పాటు వారిని దోచుకోమని చంద్రబాబునాయుడు ప్రోత్సహించారన్నారు. 2014లో ఈ ముగ్గురే కూటమిగా ఏర్పడి ముఖ్యమైన హామీలంటూ ఇంటింటికీ కరపత్రాలు పంచారన్నారు. ఆ కరపత్రాలలో ఇచ్చిన హామీలలో 10 శాతం కూడా నెరవేర్చని చంద్రబాబు నాయుడు పెత్తందార్ల దోపిడీకి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కనుక ప్రజలకు మంచి చేసేది ఎవరు, ప్రజలను మోసం చేసేది ఎవరో గుర్తించి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి తనను, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావును గెలిపించాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అనుబంధ శాఖల అధ్యక్ష కార్యదర్శులు, వార్డు ఇన్‌చార్జిలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొడాలి నానికి గజమాలతో స్వాగతం పలుకుతున్న యువత

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

గుడివాడరూరల్: రోజురోజుకు పెరుగుతున్న ఎండల నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. కాలువల ద్వారా తాగునీటి కోసం విడుదలైన నీటిని మండలంలోని పలు గ్రామాల్లో మోటార్ల ద్వారా తాగునీటి చెరువులను నింపుతున్న పనులను మంగళవారం ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. మండలంలోని చిలకమూడి, దొండపాడు, మల్లాయపాలెం, వలివర్తిపాడు, మోటూరు తదితర గ్రామాల్లో పంచాయతీ అధికారులు తాగునీటి చెరువుల్లో మోటార్ ఇంజిన్ల ద్వారా నీటిని నింపుతున్నారు. ఈ పనులను ఎంపీడీఓ పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటికి ప్రభుత్వం నీటిని కాలువల ద్వారా విడుదల చేసిందని మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న తాగునీటి చెరువులను నూటికి నూరుశాతం నింపే విధంగా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మూడు రోజుల్లోనే తాగునీటి చెరువులను నూటికి నూరుశాతం నింపాలని, అదేవిధంగా చేపల చెరువుల వారు తాగునీటిని చౌర్యం చేయకుండా సంబంధిత అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను నింపుతున్న అధికారులు

గుడివాడ టౌన్: ప్రజలకు ఏ విధమైన తాగునీటి ఇబ్బంది లేకుండా చూసేందుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. ఇరిగేషన్ శాఖ నీటిని విడుదల చేయడంతో పెద్ద సంఖ్యలో ర్యాపిడ్ స్పీడ్ మోటార్ల ద్వారా నీటిని నింపుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు రోజులుగా నీటిని నింపే ప్రక్రియ కొనసాగుతుందని త్వరలో పూర్తి స్థాయిలో నీటిని నింపుతామని ఆయన తెలిపారు.



మల్లాయపాలెంలో తాగునీటిని నింపుతున్న చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

చెరువుల్లో నీరు నింపుకోవాలి

కలిదిండి: మండలంలోని గ్రామ పంచాయతీకి చెందిన చెరువుల్లో నీరు నింపే ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీడీఓ జి.దినతేజ్ మంగళవారం తెలిపారు. క్యాంబ్ బెల్ కాలువ దిగువన ఉన్న 70 నుంచి 80 శాతం మంచినీటి చెరువులను నీటితో నింపే ప్రక్రియ పూర్తికాగా పోలరాజ్ కాలువ దిగువన వున్న నాలుగు గ్రామాల మంచినీటి చెరువులు 30 నుంచి 40 శాతం వరకు నిండాయని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే డీఎన్నార్‌ను కలిసిన బీవీ రావు



ఎమ్మెల్యే డీఎన్నార్‌ను సత్కరిస్తున్న బీవీ రావు

కైకలూరు: వైఎస్సార్ సీపీలో చేరిన బుసనబోయిన వెంకటేశ్వరరావు (బీవీ రావు) మంగళవారం కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. బీవీ.రావు జనసేన తరఫున 2019లో పోటీ చేసి 11వేలకు పైగా ఓట్లు పొందారు. ఈయనకు చార్టర్డ్ ఎకౌంటెంటుగా ఈ ప్రాంతంలో మంచి పేరుంది. యాదవ సామాజికవర్గంలో కీలక వ్యక్తి. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న బీవీ రావుకు కనీస సమాచారం ఇవ్వకుండా కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు సీటు కేటాయించడాన్ని నిరసిస్తూ ఇటీవల ఆయన జనసేన పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఏలూరు జిల్లా సిద్ధం సభ బస్సు యాత్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బీవీ రావు రాకతో నియోజకవర్గ వైఎస్సార్ సీపీలో అదనపు జోష్ వచ్చిందని నాయకులు భావిస్తున్నారు. డీఎన్నార్‌ను కలిసిన వారిలో కృష్ణాజిల్లా జనసేన పార్టీ మాజీ కార్యదర్శి పళ్లెం యువాన్, నాయకులు పచ్చిగోళ్ల రామకృష్ణ, జాజాలు వాసు, బుసనబోయిన శివరామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

మండవల్లి: మండలంలోని పుట్లచెరువు సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చిన్న కోడలు దూలం స్వాతి మంగళవారం ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను గెలిపించాలని కోరారు.

కలిదిండిలో..

కలిదిండి: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డీఎన్నార్‌ను, ఎంపీగా సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ పెద్ద కోడలు శ్రీఅనుపమ కోరారు. కలిదిండి మండలం కొండంగిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి విజయం చేకూర్చాలని ఆమె కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యాదవ ఆత్మీయ సమావేశం

కైకలూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కైకలూరు తాలూకా సెంటర్ సీతారామ ఫంక్షన్ హాల్లో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నియోజకవర్గ యాదవ ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఆహ్వాన కమిటీ మంగళవారం తెలిపింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌యాదవ్, టీటీడీ బోర్డు సభ్యుడు నెరుసు నాగసత్యం, మైలవరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, కలిదిండి జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి హాజరుకానున్నారు. యాదవ కుటుంబ సభ్యులు తప్పక సమావేశానికి హాజరుకావాలని ఆహ్వాన కమిటీ కోరింది.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

కలిదిండి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన వారిని ముందుగానే గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించాలని డీఈఓ ఎస్.అబ్రహం పేర్కొన్నారు. స్థానిక పేట కలిదిండి, ఆవకూరు ఎంపీ యూపీ స్కూళ్లలో స్టేట్ లెర్నింగ్ సర్వే-2024లో భాగంగా 50 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితంలో ప్రతిభను పరిశీలించారు. అనంతరం వచ్చే విద్యా సంవత్సరంలో అవలంబించాల్సిన విధానాలపై ఎంఈఓ ప్రభాకరరావుతో చర్చించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

పామర్రు: అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని అగ్నిమాపక కేంద్రం అధికారి ఎన్. రాంబాబు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అపార్టుమెంట్లలో ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. సెల్లార్‌లో ఆటోమేటిక్ స్ప్రింక్లర్స్ ఉపయోగించాలన్నారు. వాణిజ్య సముదాయాల్లో ఎలక్ట్రికల్ సామగ్రిని ఐఎస్ఐ మార్కు కలిగిన వాటిని మాత్రమే వాడాలన్నారు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు అగ్ని ప్రమాదాలు జరగకుండా మినీయేచర్ సర్క్యూట్ బ్రేకర్సుని అమర్చాలన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని ఫైర్ ఆఫీసర్ జె.ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో పలు ప్రధాన సెంటర్లలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పత్రాలను అందజేశామని తెలిపారు.

జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ

కైకలూరు: ముందస్తు జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని కైకలూరు అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కైకలూరు ఎన్జీఓస్ కాలనీలో రాహుల్ హోం అపార్టుమెంటులో అగ్నిప్రమాదాల నివారణపై స్థానికులకు ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం

కైకలూరు: ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో(సెబ్) ఏలూరు సూపరింటెండెంట్ కె.రామకృష్ణ పేర్కొన్నారు. కైకలూరు సెబ్ కార్యాలయంలో ఈ ఏడాది మార్చిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.94 వేల విలువైన మద్యాన్ని మంగళవారం ధ్వంసం చేశారు. కేసులో పట్టుబడిన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని వేలంపాట నిర్వహించగా జీఎస్టీతో కలపి రూ.10,384 ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అన్ని చెక్ పోస్టుల వద్ద పోలీసుశాఖతో సెబ్ సిబ్బందితో కలసి పనిచేస్తున్నారన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

పామర్రు: ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఇచ్చే సమాచారంతో రిటర్నింగ్ అధికారి సంతృప్తి చెందకపోతే తిరస్కరించే అవకాశం ఉందన్నారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన చేస్తామన్నారు. 29న సాయంత్రం వరకు ఉప సంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం అదే రోజు అర్హులైన అభ్యర్థుల తుది జాబితా ప్రచురిస్తామన్నారు. రిజర్వుడు నియోజకవర్గాలలో ఎంపీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసే వారు రూ.12,500, అసెంబ్లీ అయితే రూ.5,000 రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో డిపాజిట్‌గా చెల్లించాలని అన్నారు. లేని పక్షంతో ట్రెజరీలో కేటాయించిన పద్దులో చెల్లించిన చలానా, రిజర్వు బ్యాంకులో నగదు జమ చేసిన చలానా అందజేయవచ్చన్నారు. చెక్కులు, డీడీలకు అనుమతి ఉండబోదన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన పార్టీకి చెందిన అభ్యర్థులను ఒకరు ప్రతిపాదించాలని, రిజిస్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు పది మంది నియోజకవర్గానికి చెందిన వారు ప్రతిపాదించాలని ఆమె తెలిపారు.



పామర్రు నియోజకవర్గ ఈఆర్‌ఓ శ్రీదేవి

ఫారం-26 తప్పని సరి

అభ్యర్థికి చెందిన అన్ని విషయాలు ఫారం-26లో అఫిడవిట్‌తో తప్పని సరిగా ఇవ్వాలని తెలిపారు. నోటరీ చేసిన అఫిడవిట్లో అభ్యర్థి విద్యార్హతలు, ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసుల వివరాలు పొందుపరచాలని పేర్కొన్నారు. ఫారం-26 లోని అన్ని కాలమ్స్ పూర్తి చేయాలన్నారు. రూ.10 నుంచి రూ.100 స్టాంపు పేపర్లపై అఫిడవిట్ ఇవ్వాలని తెలిపారు. అభ్యర్థుల నేర చరిత్ర వివరాలు మే 11 లోపు పత్రికల్లో మూడు సార్లు ఎలక్ట్రానిక్ మీడియాలో ఏడు సెకన్ల లోపు మూడు సార్లు సొంత ఖర్చులతో ప్రచురించాలని, వివరాలు ఆర్వోకి ఇవ్వాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నేతలు నామినేషన్ వేయడానికి ర్యాలీగా వచ్చే ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా నమోదు చేస్తామని ఆర్వో తెలిపారు.